క్లుప్తంగా

పకడ్బందీగా గ్రామకంఠం సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ: గ్రామ పంచాయతీలలో ఆగస్టు 1వ తేదీ నుంచి గ్రామ కంఠం సర్వే నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొదటి విడతగా మండల పరిధిలోని ఎస్.కొత్తపల్లె, ఆర్.పాంపల్లె, పెద్దయమ్మనూరు, పడిగెపాడు, హరివరం గ్రామ పంచాయతీలకు సంబంధించి ఖాళీ స్థలాలు, గ్రామంలో ఉన్న రహదారులు, ఖాళీ స్థలాలు, గృహాలు, యజమానుల అనుమతులతో కొలతలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నాగలక్ష్మమ్మ పాల్గొన్నారు.

రైతులకు మొక్కల పంపిణీ



రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఏపీఓ గౌరీబాయ్

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె రస్తాలోని పెట్రోల్ బంక్ వద్ద జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఉచితంగా వివిధ రకాల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ గౌరీబాయ్ మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాలకు సంబంధించిన రైతులకు 2,300 టెంకాయ మొక్కలు పంపిణీ చేశామన్నారు. ఇంకా ఎవరైన ఆసక్తి గల వారుంటే ఉపాధి హామీ కార్యాలయంలో సంప్రదిస్తే వారికి జాస్మిన్, గులాబీ, మునగ, డ్రాగన్ ఫ్రూట్స్ వంటి 16 రకాల పండ్లమొక్కలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈసీ సుబ్బన్న, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

నంద్యాల(అర్బన్): చట్టాలపై ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని రూరల్ ఎస్ఐ గంగయ్య యాదవ్ అన్నారు. నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామంలో బుధవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం రూరల్ డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైన పౌరహక్కులకు భంగం కలిగిస్తే కోర్టుల ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. సమాజంలో అందరూ సమానమేనని, చట్టాలు అందరికీ సమానంగా వర్తిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ, బీసీ వెల్ఫేర్ శాఖాధికారులతో పాటు పబ్బతి రవి, శంకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, శీలంసుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ నిధి పేరుతో మోసం చేసిన బాబు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు నరసింహ

ఆళ్లగడ్డ: 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ. 1500 చొప్పున ఇస్తానని చెప్పి చంద్రబాబునాయుడు మహిళలందరినీ మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరసింహ అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎలాగైనా గెలుపొందాలని కూటమి నేతలు అలివిగాని హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీపై కూటమి నాయకులు పార్లమెంట్‌లో మాట్లాడి సాధించాలన్నారు.

లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్‌గా నిజాముద్దీన్

నంద్యాల(వ్యవసాయం): లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్‌గా నిజాముద్దీన్‌ను నియమించినట్లు మాజీ జిల్లా గవర్నర్ ఇల్లూరి గోపాలకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా చేసిన సేవలకు గుర్తించి ఈసారి జోన్‌కు చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. జోన్ పరిధి లోని క్లబ్ సేవలను నిజాముద్దీన్ పర్యవేక్షిస్తారన్నారు.

పక్కాగా స్వామిత్వ సర్వే

చాగలమర్రి: స్వామిత్వ పథకం కింద చేపట్టే ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ తాహెర్ హుసేన్ అన్నారు. స్వామిత్వ రీసర్వేలో భాగంగా బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీర్ సహాయకులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామకంఠం పరిధిలో కట్టిన ఇళ్లు, భూములను, దగ్గరలో ఉన్న ఇళ్లను సర్వే చేసి వారికి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం స్వామిత్వ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. మండలంలో దాదాపు 10 గ్రామాలను సర్వే కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు.

కోనేటి రాయుడి

మహోత్సవానికి ముస్తాబు

- రేపటి నుంచి కలశ ప్రతిష్ఠోత్సవం
- మూడు రోజుల పాటు జరగనున్న వేడుకలు
- నూతనంగా ఆలయ ముఖద్వారంపై రాజగోపురం నిర్మాణం



ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి



విద్యుత్ దీపాల అలంకరణతో నూతనంగా నిర్మించిన రాజగోపురం

కలశ ప్రతిష్ఠ పూజ కోసం ఏర్పాటు చేసిన మెట్లు

ఉయ్యాలవాడ: మహిమాన్వితుడిగా వెలుగొందుతూ భక్తుల నుంచి నిత్యం పూజలందుకుంటున్న కోనేటి రాయుడు కలశ ప్రతిష్ఠ మహోత్సవాలకు సిద్ధమవుతున్నారు. ఈనెల 1నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని ఇంజేడు గ్రామంలో 1976 సంవత్సరంలో నిర్మితమైన ఈ ఆలయాన్ని ప్రతి శనివారం వందలాది మంది భక్తులు తరలివచ్చి దర్శించుకుంటారు. ఇక్కడికి వచ్చి ఏదైనా మొక్కుకుంటే స్వామి తీరుస్తాడని భక్తుల నమ్మకం. దీంతో నిత్యం ఇక్కడ భక్త జన సందడి కనిపిస్తూ ఉంటోంది. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా ముక్కోటి ఏకాదశి రోజున భక్తులకు స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం, శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

రూ.61 లక్షలతో రాజగోపురం నిర్మాణం

ఇంజేడు గ్రామవాసి, వైఎస్సార్‌సీపీ మండల మధ్యక్షుడు గజ్జెల క్రిష్టారెడ్డి తన సొంత నిధులు రూ. 20 లక్షలతో పాటు దాతల నుంచి సేకరించి మరో రూ. 41 లక్షలతో ఆలయ ముఖద్వారంపై రాజగోపురం (గాలిగోపురం) నిర్మించారు. ఉత్సవాల్లో భాగంగా 1వ తేదీన మహా గణపతి పూజ, నాంది రక్షాబంధనం, పంచగవ్యప్రసాన, రుత్విక్ గ్వరణము, యాగశాల ప్రవేశం, జపాలు, మహా మంగళహారతి, అంకురారోపణం, జలాధివాసం, అగ్నిముఖం, 2న ప్రాతః కాలపూజ, మంత్రాలకు అభిషేకం, లక్ష్మీ గణపతి రుద్ర పంచ హోమాలు, ధాన్యానివాసం, శయ్యాధివాసం, అధివాసంగ హోమాలు, మంగళ హారతి, 3న కుంభాభిషేకం, శిఖర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, కుష్మాండ బలి, జ్వాలా దర్శనం, పూర్ణాహుతి, కలశ మార్చనం, కంకణ విసర్జన, మహా మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాదాలు వినియోగం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. రాజగోపురాన్ని ఆధునిక టెక్నాలజీతో నిర్మించారు. స్వామి వారికి మెట్ల మార్గం ఒక వైపున అమర్చారు. రేపటి నుంచి జరిగే కలశ ప్రతిష్ఠ వేడుకలకు స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉండటంతో నిర్వాహకులు అన్నదాన వితరణకు ఏర్పాట్లు చేశారు.

జూనియర్ జూడో జట్టుకు ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా సబ్ బాలబాలికల జూనియర్ జూడో జట్టు ఎంపిక పోటీలు ఆగస్టు 2వ తేదీన ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ తెలిపారు. పద్మావతినగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఎంపిక కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాకు ఎంపికైన బాలబాలికల జట్టు ఆగస్టు 9, 10 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఎంపికకు వచ్చే బాలబాలికలు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. 2011-13 సంవత్సరాల్లో జన్మించిన వారై ఉండాలన్నారు. ఈ పోటీలు వివిధ కేటగిరిలో జరుగుతాయన్నారు. బాలుర విభాగంలో 30, 35, 40, 45, 50, 55, 60, 66, ప్లస్ 66 విభాగాల్లో, బాలికల విభాగంలో 28, 32, 36, 40, 44, 48, 52, 57, ప్లస్ 57 కేజీల్లో జరుగుతాయని తెలిపారు.

అలరించిన హరికథాగానం

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన కె.ప్రమీల భాగవతారిణి వారిచే శివపార్వతుల కల్యాణంపై హరికథాగానం నిర్వహించారు. కార్యక్రమానికి తబలా సహకారాన్ని బాబురావు, హార్మోనియం సహకారాన్ని వై.మురళి అందించారు.

ఉపాధ్యక్షుడిగా మౌలానా ఆరీఫ్

చాగలమర్రి: కాంగ్రెస్‌పార్టీ ఏపీ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడిగా చాగలమర్రికి చెందిన మౌలానా షేక్ ఖతీబ్ అబ్దుల్ మజీద్ ఆరీఫ్‌ను నియమించారు. ఆ సెల్ చైర్మన్ షాలీ దాదా గాంధీ బుధవారం నియామక ఉత్తర్వులు అందజేసినట్లు ఆయన తెలిపారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్ రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): మానవ అక్రమ రవాణా పట్ల జాగ్రత్తగా ఉండాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి స్వప్న ప్రియ, టూ టౌన్ ఎస్ఐ సురేష్ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం యాక్సిస్ టు జస్టిస్ ప్రోగ్రాంలో భాగంగా హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ఫర్ గర్ల్స్ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మానవ అక్రమ రవాణా జరుగుతున్న తీరుపై అవగాహన కల్పించారు. పిల్లలు అక్రమ రవాణాకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. ఎక్కడైనా అక్రమ రవాణా జరుగుతుందని తెలిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి గాని, ఉమెన్ హెల్ప్ 181 గాని సమాచారం ఇవ్వాలన్నారు. న్యాయవాది ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను నిర్మూలించేందుకు తమవంతు సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంపత్, లోక్‌అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి, రాజు, మహేష్ పాల్గొన్నారు.

మేలు రకం విత్తనాలతో అధిక దిగుబడులు



పెద్దబోధనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వనరుల ఏడీఏ చెన్నయ్య

చాగలమర్రి: రైతులు మేలు రకం విత్తనాలను వినియోగించాలని తద్వారా చీడ పీడల నుంచి పంటలను కాపాడుకోవచ్చు, అధిక దిగుబడి పొందవచ్చని నంద్యాల జిల్లా వనరుల వ్యవసాయ సహాయ సంచాలకులు చెన్నయ్య అన్నారు. బుధవారం చాగలమర్రి మండలంలోని పెద్దబోధనం గ్రామంలో స్థానిక ఏఓ రంగనేతాజి ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. మొక్కజొన్న, మినుము పంటలలో అధిక ఎరువుల వాడకం ద్వారా నేల ఆరోగ్యం దెబ్బతిని భూమి చౌడుబారి పంట దిగుబడి తగ్గుతుందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు సమగ్ర ఎరువుల మాజమాన్యం పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఏడీ విజయ శేఖర్, జిల్లా వనరుల వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వరరెడ్డి, ఏఈఓ రేవతి, కళ్యాణ్ నాయక్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

- **నంద్యాల(అర్బన్):** ప్రస్తుతం వరి నారుమడుల్లో జింక్‌లోపం ఉందని, వాటి నివారణకు రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి తెలిపారు. 5 సెంట్ల నారుమడికి 2 కేజీల నత్రజని, ఒక కిలో పొటాష్ ఇచ్చే ఎరువులు వేయాలన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నంద్యాల మండలంలోని అయ్యలూరు, పెద్దకొట్టాల గ్రామాల్లో ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రీధర్, లింగమయ్య, ఆత్మ బీటీఎం ఉమామహేశ్వరి, సురేంద్రనాయక్, మురళీ, రైతులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన మొక్కలు అందించాలి



పెద్దకంబలూరు మెట్ట వద్ద ఆయిల్ ఫామ్ నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం: ఆయిల్ ఫామ్ నర్సరీ నుంచి రైతులకు నాణ్యమైన మొక్కలను అందించాలని 3ఎఫ్ జోనల్ మేనేజర్ మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెద్దకంబలూరు మెట్ట వద్ద అనిరుద్ అనే వ్యక్తి ఆయిల్ ఫామ్ నర్సరీని ఏర్పాటు చేశాడు. బుధవారం ఆ నర్సరీని 3ఎఫ్ జోనల్ మేనేజర్ అక్కడికి వెళ్లి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేసుకుంటే ఉద్యాన శాఖ ద్వారా హెక్టారుకు రూ. 29 వేలు రాయితీ ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి సంప్రదించాలన్నారు. ఆయన వెంట ఉద్యాన శాఖ ఆళ్లగడ్డ అధికారి దస్తగిరి, ఏరియా మేనేజర్ నాగరాజు తదితరులు ఉన్నారు.

హోటల్ నిర్వాహకులు శుభ్రత పాటించాలి



హోటల్ నిర్వాహకులకు సూచనలిస్తున్న దేవస్థాన ఈఓ, పాల్గొన్న అధికారులు

- హోటల్ నిర్వాహకులతో ఈఓ ఎం. శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం పరిధిలోని హోటల్ నిర్వాహకులు శుచీ, శుభ్రతను పాటించాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం శ్రీశైలంలోని మల్లికార్జున కల్యాణమండపంలో దేవస్థాన పరిధిలోని హోటల్ నిర్వాహకులతో దేవస్థాన అధికారులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి నంద్యాల జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ హోటల్ నిర్వాహకులు ఎప్పటికప్పుడు తాజా కూరగాయలనే వాడాలన్నారు. పాత్రలను కూడా తరచూ శుభ్రపరుస్తుండాలన్నారు. నిల్వ ఆహర పదార్థాలను అందించరాదని సూచించారు. ఆహార పదార్థాల తయారీలో వినియోగించే వస్తువులు పూర్తి నాణ్యతతో ఉండాలన్నారు. హోటల్స్‌లో పనిచేసే వారు భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. నాణ్యమైన ముడిసరుకుతో రుచికరమైన ఆహారాన్ని భక్తులకు అందజేయాలని అన్నారు. ప్రతి నెలలో రెండుసార్లు రెవెన్యూ, శానిటేషన్, ఫుడ్‌ఇన్స్పెక్టర్లతో ఆహార పదార్థాలపై, హోటల్ నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు చేయిస్తామన్నారు. అనంతరం ఫుడ్‌సేఫ్టీ అధికారులు మాట్లాడుతూ హోటల్ నిర్వాహకులందరు ఆహార పదార్థాల తయారీలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐ.వి.ఆర్ సిస్టం ప్రకారం ప్రతి ఒక్కరు ఆహార పదార్థాలను సిద్ధం చేయాలని, టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్స్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. ప్రతి హోటల్ తప్పనిసరిగా ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ వారియొక్క లైసెన్సును కలిగి ఉండాలన్నారు. ఎంఆర్‌పి రేట్లకు మించి అధికధరలకు విక్రయిస్తే లీగల్ మెట్రాలజీ శాఖ తగిన చర్యలు తీసుకోనబడతాయని అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ జి.మల్లికార్జునరెడ్డి, పీఆర్వో టి.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు డి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీఎన్ఎస్ఎస్‌కు నీటి విడుదల పెంపు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి జీఎన్ఎస్ఎస్‌కు బుధవారం నీటి విడుదల పెంచినట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి 30 వేల నుంచి వెయ్యి క్యూసెక్కులు పెంచి 31 వేల క్యూసెక్కుల నీరు ఎస్ఆర్ఎంసీ ద్వారా ఇన్‌ఫ్లో ఉందన్నారు. కాగా జీఎన్ఎస్ఎస్ కు 8వేల నుంచి 10వేల క్యూసెక్కులకు నీటి విడుదల పెంచామని, తెలుగుగంగ(వీబీఆర్)కు 14వేల నుంచి 13వేల క్యూసెక్కులకు తగ్గించామని, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 8వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. కాగా వీబీఆర్‌లో 15 వేలకు పైగా టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు.

అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయాలి

నంద్యాల(అర్బన్): పీఎం కిసాన్ సమ్మాన్ నిధులతో పాటు అన్నదాత సుఖీభవ నిధులను అర్హులైన రైతుల ఖాతాల్లో తక్షణమే జమ చేయాలని కిసాన్ మోర్చా నంద్యాల జిల్లా గౌరవాధ్యక్షుడు తూముశివారెడ్డి, ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లతో పాటు స్ప్రేయర్లు, డ్రోన్‌లు అందించి అన్నదాతలను ఆదుకోవాలన్నారు. జిల్లా రైతుల సమస్యలను ఇటీవల నంద్యాల పర్యటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర రథ సారథి పీవీఎన్ మాధవ్‌కు వివరించామన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలి

- సోలార్ పరిశ్రమలో భూములు కోల్పోయిన గిరిజన రైతులు ఆందోళన



సోలార్ వద్ద ఆందోళన చేపట్టిన గిరిజన రైతులు

గడివేముల: మండల పరిధిలోని ఒండుట్ల,పైబోగుల గ్రామాల మధ్య నిర్మిస్తున్న సోలార్ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన తమకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందని బాధిత గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు సోలార్ పరిశ్రమ వద్ద ఆందోళన చేపట్టారు. జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ మాట్లాడుతూ గత కొన్ని రోజుల కిందట గిరిజనులు భూములను పరిశ్రమ కోసం తీసుకున్నారన్నారు. అయితే, వారికి ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదన్నారు. ఇదిలా ఉంటే జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ వెంకటరమణ సిబ్బందితో కలిసి గిరిజనుల భూములు వద్దకు వచ్చి సర్వే చేశారు. పూర్తి నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రైతులు బద్దు నాయక్, సామే నాయక్, జీవుల నాయక్, హిమీబాయి, వెంకట రాముడు, స్వామి నాయక్, సీతమ్మ బాయి, బాబు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– జమ్మలమడుగు ఆర్అండ్‌బీ రహదారిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఎల్ఎం కాంపౌండ్‌లో నివాసం ఉంటున్న ఏసేబు (55) గడేకారిగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి సైకిల్‌పై బహిర్భూమికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్కెట్‌యార్డు సమీపంలో కోవెలకుంట్ల వైపు నుంచి వెళ్తున్న స్కూటి వేగంగా ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో వాహనదారుడైన పట్టణానికి చెందిన సనా ఉల్లాఖాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పాలేరు వాగులోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు– ఉప్పలూరు గ్రామాల మధ్య ప్రవహిస్తున్న పాలేరువాగులోకి బుధవారం సాయంత్రం ఓ ట్రాక్టర్ దూసుకెళ్లింది. మండలంలోని కలుగొట్లకు చెందిన సుధాకర్‌రెడ్డి ట్రాక్టర్‌తో పొలంలో సేద్యం చేసి తిరిగి ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో పాలేరు వాగు సమీపంలో ట్రాక్టర్ ఇంజిన్ అదుపు తప్పి వాగులోకి దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తమై ట్రాక్టర్ నుంచి దూకడటంతో ప్రాణపాయం తప్పింది. రేవనూరు పోలీసులు విచారణ జరుపుతున్నారు.

పీఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన కల్పించండి



శిరివెళ్లలో మిద్దెపై ఏర్పాటు చేసిన సౌరశక్తి పలకలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

శిరివెళ్ల: పీఎం సూర్య ఘర్ యోజనపై ప్రజలకు అవగాహన కల్పించాలని డ్వామా పీడీ సూర్య నారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటైన సౌర శక్తి పలకను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ, ఉపాధి పథకం సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలకు విద్యుత్ బిల్లు భారం తగ్గించేందుకు సబ్సిడీపై సూర్య ఘర్ యోజన పథకాన్ని అమలు చేస్తుందన్నారు. పథకం కింద ఇంటిపై సౌర్య శక్తి పలకను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. యూనిట్ బట్టి సబ్సిడీని ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే 120 యూనిట్ల సౌర శక్తి ఉత్పత్తివుతుందన్నారు. కరెంట్ బిల్లు రూ. వెయ్యి వస్తే అదే సౌరశక్తి విద్యుత్‌కు రూ. 330 బిల్లు వస్తుందన్నారు. ఏడాదికి రూ. 8 వేల ఆదావుతుందన్నారు. 3 కిలో వాట్ సౌర పలకల వ్యవస్థ ఏర్పాటుకు 2.24 లక్షలు ఖర్చువుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 78 వేల సబ్సిడీ ఇస్తుందన్నారు. అనంతరం ఉపాధి పథకం కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతు ప్రభుత్వం ఉద్యానవన పంటలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. 2025–26 సంవత్సరానికి జిల్లాలో 4500 ఎకరాల్లో ఉద్యానవన పంటలను సాగు చేయాలన్నది లక్ష్యమన్నారు. ఇంత వరకు 1,078 ఎకరాల్లో పంటల సాగుకు సన్నాహాలు జరిగాయన్నారు. జిల్లాలో 59,900 ఇంకుడు గుంతలు తవ్వాలన్నది లక్ష్యం కాగా ఇంత వరకు 1200 గుంతల తవ్వకాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస శర్మ, ఏపీఓ రామసుబ్బయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ చేసిన జడ్జి



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి అమ్మన్న రాజ

నంద్యాల (వ్యవసాయం): నంద్యాల సబ్ జైల్లో బుధవారం సాయంత్రం మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్నరాజ ఆకస్మిక తనిఖీ చేశారు. ఖైదీల సంఖ్య, వారి ఆరోగ్యం తదితర వివరాలను సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. జైలు పరిసరాలను పరిశీలించి వంట గదులు, , ఖైదీల గదులు పరిశీలించారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జైలులో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న వారు సత్ప్రవర్తలతో జీవించడానికి ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాది బాలునాయక్, రామచంద్రారెడ్డి, సూపరింటెండెంట్ గురు ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సేవలు





మహిళకు చెక్కు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి, కార్యక్రమానికి హాజరైన మహిళలు

- శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ ఆధ్వర్యంలో 133 ముంది మహిళలకు రుణాలు
- మంచిని ప్రోత్సహించాలేకాని అడ్డుకోవడం సరికాదు
- మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల: రాజకీయాలకు అతీతంగా శిల్పా సేవా సమితి ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ ఆధ్వర్యంలో 133 ముంది మహిళలకు రూ.21.06 లక్షల రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ దశాబ్దకాలంపైగా నుంచి నంద్యాల ప్రజలకు ఎటువంటి లాభాపేక్షలేకుండా తమ సేవాసమితి ఆధ్వర్యంలో శిల్పాసహకార్, రైతుసహకార్, మహిళా సహకార్, ఉచిత మినరల్ వాటర్, వైఎస్సార్ కళ్యాణముండపం వంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ సేవా కార్యక్రమాలను కొందరు పనిగట్టుకొని అడ్డుకుంటున్నారని, దీని ఎవరికి నష్టం వస్తుందో ప్రజలు గ్రహించాలన్నారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు అడ్డుకునే బదులు పోటీపడి ప్రజలకు సేవ చేయాలని హితవుపలికారు. తాము అధికారంలో ఉన్నా, లేకున్నా నంద్యాల ప్రజలను శిల్పా కుటుంబంగా భావిస్తామన్నారు. ప్రజల మంచి కోరేవారు ఎవరైనా సరే శిల్పా సేవా కార్యక్రమాలను అడ్డుకోరన్నారు. తమ సేవాసమితి వ్యాపార సంస్థకాదనే విషయాన్ని గ్రహించుకోవాలన్నారు. శిల్పా మహిళా సహకార్ ద్వారా రుణాలు పొందిన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, బ్యాంక్ మేనేజర్ హరిలీల, సేవాసమితి మేనేజర్ లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పీపీ మధుసూదన్ రెడ్డి, శివనాగిరెడ్డి, దామోదర్ రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.